ప్రజాశక్తి

సోమవారం 29 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

వాగులపై దాగుడు మూతలు

- ప్రభుత్వ భూమిలో మ్యుటేషన్లు
- శాశ్వత భవన నిర్మాణాలు
- రూ.18 కోట్ల విలువైన 2.12 ఎకరాలు ప్రయివేటు వ్యక్తుల పరం
- స్థానికుల ఫిర్యాదుతో వెబ్‌ల్యాండ్‌లో రెడ్‌మార్క్
- కలెక్టర్ హెచ్చరిక బోర్డును లెక్కచేయని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

పరవాడ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ప్రభుత్వ భూమి ప్రయివేటు వ్యక్తుల వశమవుతోంది. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు కళ్లుమూసుకోవడంతో ప్రయివేటు వ్యక్తులకు ఆక్రమణలు సులవయ్యాయి. గాజువాక-యలమంచిలి ప్రధాన రహదారికి రెండువైపులా 297 సర్వే నెంబరులో 76 సెంట్లు, 293 సర్వే నెంబర్‌లో ఎకరా 36 సెంట్లు భూమిలో నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నారు. 297, 293 సర్వే నెంబర్లలోని రెండెకరాల 12 సెంట్లు భూమి విలువ రూ.18 కోట్లకుపైగా ఉంది. ఇంత విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణల పాలవుతున్నా, ప్రయివేటు వ్యక్తులు శాశ్వత భవనాలు నిర్మించి వ్యాపారాలు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడంతో రెవెన్యూ అధికారుల తీరుపై అనేక అనుమానాలు, విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ భోనంగి రెవెన్యూ గొర్లివానిపాలెం గ్రామ పంచాయతీ సర్వేనెంబర్ 293లో ఎకరా 36 సెంట్లులో గెడ్డవాగుగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదైంది. 2018లో ఈ వాగును ప్రయివేటు వ్యక్తి గ్రావెల్‌తో పూడ్చుతున్న విషయం అప్పటి తహసీల్దార్ పివివిఎస్ మల్లేశ్వరరావుకు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదుపై ఈ భూమిని తహశీల్దార్ పరిశీలించారు. ఇది ప్రభుత్వానికి చెందిన భూమంటూ, అనుమతిలేకుండా ప్రవేశించిన, ఆక్రమించడానికి ప్రయత్నించినా సెక్షన్ 4(1), 4(2), 4(3) ఎపి ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 1982 ప్రకారం చర్యలు తీసుకుంటామని అప్పట్లో కలెక్టర్ పేరున హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. కలెక్టర్ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన ప్రభుత్వభూమిని ప్రస్తుత తహశీల్దార్ వి.ప్రకాశరావు జిరాయితీగా నమోదు చేసి రైతులపేర మ్యూటేషన్ చేయడం వివాదస్పంగా మారింది. వాగును గ్రావెల్‌తో పూడ్చిన విషయం స్థానికులు ఫిర్యాదుచేయడంతో వెబ్ ల్యాండ్‌లో రెడ్ మార్క్ పెట్టి రైతులకు నోటీసులు ఇచ్చి తహశీల్దార్ కొత్త వివాదానికి తెరలేపారు.

సర్వేనెంబర్ 297లో 76 సెంట్లు ప్రభుత్వ రికార్డులలో వాగుగా నమోదుచేశారు. పరవాడ రెవెన్యూ సర్వే

మిగతా 2లో..

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రశాంతంగా యుపిఎస్‌సి ప్రిలిమినరీ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) ప్రిలిమినరీ పరీక్ష విశాఖలో ప్రశాంతంగా ముగిసింది. లంకపల్లి బుల్లయ్య కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిబంధనలు, ఏర్పాట్లుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పరీక్షకు విశాఖ జిల్లాలో మొత్తం 29 సెంటర్ల నందు 10,864 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా ఉదయం పరీక్షకు 5607 మంది, మధ్యాహ్నం పరీక్షకు 5536 మంది హాజరయ్యారు. 51.28 శాతం హాజరు నమోదైంది. ఈ కార్యక్రమంలో అర్బన్ తహశీల్దార్ ఎం.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో నిబంధనలు పాటించాలి : ఫ్యాప్టో

వార్త 4లో..

స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ఆర్థిక సాయం అందించాలి

వార్త 2లో..

నేడు మున్సిపల్ వర్కర్ల టోకెన్ సమ్మె

వార్త 2లో..

పనులు జాస్తి.. సౌకర్యాలు నాస్తి...

వార్త 3లో..

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు

వార్త 8లో.

ఆర్గానిక్ సర్టిఫికేషన్‌తో మేలు

అరకు కాఫీకి పెరగనున్న డిమాండ్, ధర
దళారుల బారి నుంచి గిరి రైతులను రక్షించేందుకు చర్యలు
జిసిసి ఎమ్‌డి సురేష్‌కుమార్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ

అరకు కాఫీ, మిరియాలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ రావడంతో గిరి రైతులకు ఎంతో మేలు జరగనుందని, ఈ పంటలకు డిమాండ్, ధర పెరగనుందని గిరిజన్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ (జిసిసి) ఎమ్‌డి జి.సురేష్‌కుమార్ తెలిపారు. జిసిసి విస్తరణలో భాగంగా హైదరాబాద్, విజయవాడలో నూతనంగా అవుట్‌లెట్లను ప్రారంభించేందుకు చేస్తున్న కృషి, దళారుల భారి నుంచి రైతులను రక్షించేందుకు చేపడుతున్న చర్యలపై ప్రజాశక్తికి చెప్పిన విషయాలు ఆయన మాటల్లోనే...

అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ వల్ల ప్రయోజనాలు ఏమిటి? తద్వారా రైతాంగానికి కలిగే లబ్ధి ఏమిటి?

జిసిసి అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ లభించడం ద్వారా ఈ ఉత్పత్తికి మార్కెట్‌లో డిమాండ్, ధర పెరిగి రైతులు ఆర్థికంగా లాభపడతారు. డిమాండ్ పెరగడం ద్వారా ఈ ఉత్పత్తిని సాగు చేయడానికి రైతులు ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఆర్గానిక్ సర్టిఫికేషన్ విషయానికి వస్తే మా తోట అనే ప్రయివేట్ ఆర్గనైజేషన్ గతంలో 500 మంది రైతులతో కాఫీ ఉత్పత్తుల పండించి దానికి ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందింది. ఇప్పుడు జిసిసి చింతపల్లి డివిజన్ పరిధిలో గల గొందిపాకలు, లంబసింగి, కప్పాలు క్లస్టర్లకు గాను

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వాగులపై దాగుడు మూతలు

నెంబరు 11లోని కొండ నుంచి వచ్చే వర్షపు నీరు ఈ వాగుల గుండా సర్వే నెంబర్ 292లోని ఈతల చెరువుకు చేరేది. 1956-57 సర్వే సెటిల్మెంట్ ప్రకారం సర్వేనెంబర్ 297, 293లోని విస్తీర్ణం వాగులుగా నమోదయ్యాయి. అయితే గతంలో పనిచేసిన తహశీల్దార్ గంగాధరరావు సర్వేనెంబర్ 297లోని 76 సెంట్లు గెడ్డ వాగుకు ఆన్ లైన్, వెబ్‌ల్యాండ్‌లో జిరాయితీగా నమోదు చేశారు. వాగును గ్రావెల్‌తో పూడ్చి కొబ్బరిమొక్కలు వేయడంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆన్ లైన్ రికార్డులలో రెడ్ మార్క్‌లో పెట్టారు. ఎస్ఎఫ్ఎ, ఎస్ఎల్ఆర్, ఫీల్డ్ మెజర్మెంట్ బుక్, రెవిన్యూ విలేజ్ మ్యాప్‌ను పరిశీలించి రెవెన్యూ రికార్డుల్లో హక్కుదారుల పేర్లను నమోదు చేయాల్సివుంది. డబ్బులకు కక్కుర్తిపడ్డ రెవెన్యూ అధికారులు, వాగులను జిరాయితీ భూములుగా మార్చి ప్రయివేటు వ్యక్తుల పేరిట రికార్డుల్లో నమోదుచేసి ఆక్రమణలకు సహకరిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి సర్వే నెంబర్ 293, 297 గెడ్డవాగుల ఆక్రమణలు తొలగించి, ఈతలచెరువుకు నీరు చేరేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిని రెవెన్యూ రికార్డుల్లో జిరాయితీగా కొంతమంది వ్యక్తుల పేర నమోదుచేయడంపై తహసీల్దార్ వి.ప్రకాశరావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా, సర్వే నెంబరు 293 ఇనాం భూమి అని పేర్కొన్నారు. తహసీల్దార్ పిఎవిఎస్ మల్లేశ్వరరావు ఈ భూములను ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు పెట్టడడంతో ఈ గందరగోళం ఏర్పడిందన్నారు.

ఆర్గానిక్ సర్టిఫికేషన్‌తో మేలు

1300 మంది రైతులు సుమారు 21104.76 ఎకరాలలో పండిస్తున్న కాఫీ, మిరియాలు పంటలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ లభించింది. దీనికి కావాల్సిన సహకారాన్ని రోకో, గిరిజన వికాస సంస్థల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూనే ఉన్నాం. ఈ ఆర్గానిక్ సర్టిఫికేషన్‌కు కావాల్సిన డాక్యుమెంటేషన్, ల్యాబ్ టెస్టింగ్‌లకు సంబంధించి పూర్తి ఖర్చులు జిసిసి భరించింది.

దళారుల నుంచి రైతులను రక్షించేందుకు జిసిసి తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

రైతులు దళారుల బారిన పడి నష్టపోకుండా ఉండేందుకు పండిస్తున్న పంటకు మద్దతు ధరను ఇప్పటికే భారీగా పెంచాం. తూకం, చెల్లింపుల విషయంలో పారదర్శకంగా ఉంటూ సకాలంలో డబ్బులు చెల్లించడం ద్వారా రైతులు తమ ఉత్పత్తులను జిసిసికే విక్రయించే విధంగా చర్యలు చేపట్టాం. జిసిసికి ఉత్పత్తులను అమ్మడం ద్వారా కలిగే ప్రయోజనాలను, లాభాలను ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు వివరిస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో రైతులకు ఎటువంటి సహకారం కావాల్సినా జిసిసి అధికారులు ముందుండి అందిస్తున్నారు. తద్వారా ఎక్కువ మంది రైతులు తమ ఉత్పత్తులను జిసిసికే అమ్మే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాం.

ఈ ఏడాది చింతపండు కొనుగోలు అమ్మకాలు ఎలా ఉన్నాయి?

ఈ ఏడాది చింతపండు కొనుగోలు ఆశించిన దాని కంటే మెరుగ్గా ఉంది. ఇప్పటికే 2500 టన్నులకు పైగా చింతపండు నిల్వలు జిసిసి వద్ద ఉన్నాయి. ఈ ఏడాది ముగింపు వరకు చింతపండుకు ఎటువంటి కొరత రాకుండా తగిన ప్రణాళికలు రచించాం.

వేసవి ఉత్పత్తుల అమ్మకాలు ఎలా ఉన్నాయి?

జీసీసీ పరిధిలోని చింతపల్లి అటవీ ప్రాంతంలో నన్నారి, చిల్గా అటవీ ఉత్పత్తుల ద్వారా షర్బత్ బాటిళ్ల అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది గడిచిన రెండు నెలల్లో లక్షకు పైగా ఈ షర్బత్ బాటిల్ అమ్మకం జరిగింది. ఈ వేసవి ముగిసేనాటికి మరొక 50 వేల బాటిళ్ల అమ్మకాలు జరుగుతాయని అంచనా వేస్తున్నాం.

గిరిజన ప్రాంతంలో పనిచేసే జిసిసి ఉద్యోగులకు కల్పిస్తున్న ప్రత్యేక సదుపాయాలు?

జిసిసిలో పనిచేస్తున్న 280 మంది రెగ్యులర్ ఉద్యోగులకు ఈ నెల 11న ఎపి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ద్వారా హెల్త్ కార్డులు అందించాం. ఈ హెల్త్ కార్డుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జిసిసి ఉద్యోగులు అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో వైద్య సేవలు పొందుతారు. అత్యవసర, సాధారణ నగదు రహిత చికిత్సలు పొందేందుకు వీలుంటుంది.

జిసిసిలో నూతన ఉత్పత్తులేమైనా తెస్తున్నారా?

జిసిసిలో నూతనంగా ఇన్‌స్టంట్ కాఫీ అమ్మకాలు ప్రారంభించాం. ఈ ఇన్‌స్టంట్ కాఫీ పలు రకాలు ప్యాకెట్లలో అందుబాటులో ఉన్నాయి. వీటి అమ్మకాలు ఎక్కువగానే సాగుతున్నాయి. హెర్బల్ హెయిర్ ఆయిల్, ఫ్లోర్ క్లీనర్ ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తోంది. గత ఏడాది జిసిసి ఉత్పత్తుల అమ్మకాల ద్వారా సుమారు రూ.18 కోట్లు ఆదాయాన్ని ఆర్జించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దానిని రూ.22 కోట్ల వరకు పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

జిసిసి విస్తరణకు చేపడుతున్న చర్యలు ఏమిటి?

జిసిసి కాఫీ షాపుల ఏర్పాటుకు ఔత్సాహికులైన వ్యాపారవేత్తలు రూ.లక్ష డిపాజిట్ కట్టి డిస్ట్రిబ్యూషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి నియమ నిబంధనల ప్రకారం అవుట్‌లెట్లకు పర్మిషన్ ఇస్తాం. హైదరాబాద్ హైటెక్ సిటీ సమీపంలో జిసిసి నూతన అవుట్‌లెట్‌ను 15 రోజుల్లో ప్రారంభిస్తాం. అనంతరం విజయవాడలో కూడా ఒక నూతన జిసిసి అవుట్‌లెట్ ప్రారంభానికి అధికారులతో చర్చలు జరుపుతున్నాం. ఇప్పటికే విశాఖ సిరిపురం పెట్రోల్ బంకు, ఉషోదయ జంక్షన్ ప్రాంతాల్లో జిసిసి అవుట్‌లెట్లు ఉన్నాయి.

జివిఎంసి అధికారుల కుట్రపూరిత వైఖరికి నిరసనగా..

నేడు మున్సిపల్ వర్కర్ల టోకెన్ సమ్మె

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసి పారిశుధ్య విభాగంలో 482 పోస్టుల భర్తీలో కార్మికుల వారసులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నప్పటికీ అధికారులు కుట్రపూరిత వైఖరి అవలంబిస్తున్నారని, ఈ చర్యకు నిరసనగా సోమవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన టోకెన్ సమ్మె నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి తెలిపారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, క్లాప్ డ్రైవర్లు, మలేరియా, వెటర్నరీ, నీటిసరఫరా, యుజిడి, పార్కుల్లో పనిచేసే కార్మికులకు సెమి స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే జూన్ 19 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కరోనా కాలంలో కూడా ప్రజల ఆరోగ్యాల కోసం తమ ప్రాణాలను తెగించి పనిచేసారని గుర్తుచేశారు. అటువంటి కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించకపోవడం, పలు విభాగాల్లో పనిచేసే కార్మికులకు సెమీ స్కిల్డ్, స్కిల్డ్ వేతనాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. 25 ఏళ్ళకు పైగా సేవలందించిన పారిశుధ్య కార్మికులు విరమణ పొందినా, ప్రమాదంలో అంగవైకల్యానికి గురైనా, మృతిచెందినా పర్మినెంట్ కార్మికుల వలే ఒక్క రూపాయి కూడా వీరికి నష్టపరిహారం రాదన్నారు. అటువంటి కార్మికుల వారసులకు చెందాల్సిన డెత్, రిటైర్డ్, లాంగ్ ఆబ్సెంట్ పిల్లలకు ఎందుకు ఉపాధి కల్పించరని ప్రశ్నించారు. 482 పోస్టులు ఖాళీలైతే వాటి స్థానంలో వారి పిల్లలు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జివిఎంసి స్క్రూట్నీ కమిటీ ఫైనల్ చేసిన 316 పోస్టులకు గాను 77 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు కమిషనర్ చెప్పడం సరికాదన్నారు. ఇప్పటికే 300 మందిని టెంపరరీ పేరుతో వేసుకున్నారని, వీరు టెంపరరీ అయితే పర్మినెంట్ కార్మికుల వలే ఫేషియల్ రీడింగ్ ఎలా తీస్తారని ప్రశ్నించారు. పోస్టులు అమ్ముకుంటున్నారని సిఐటియు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఎందుకు విచారణ చేయలేదని, కౌన్సిల్ ఆమోదం లేకుండా ఎందుకు వర్క్ ఆర్డర్ ఇచ్చారని, ఏ అర్హతలు ఉన్నాయని 300 మంది కమిషనర్ తీసుకున్నారని ప్రశ్నించారు. సిఎం బంధువులమని చెప్పుకుంటున్న క్లాప్ కాంట్రాక్టర్లు బ్రోకర్ల ద్వారా డ్రైవర్ల నుంచి వసూలు చేసిన డిపాజిట్ డబ్బు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ లేబర్ కమిషనర్ వివక్ష లేకుండా జీవో 7 ప్రకారం ఇచ్చిన ఆదేశాలు అమలు చేయడం లేదన్నారు. పైగా కార్మికుల హక్కుల కోసం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న సిఐటియు నేత పి.వెంకటరెడ్డి గొంతు నొక్కటానికి కుట్రపూరితంగా ఒక దళిత ద్వారా మహిళా చేత అవినీతి ఆరోపణలు చేస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారన్నారు. దీని వెనక ఎవరున్నారో తేలే వరకు సిఐటియు విశ్రమించదన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చే ప్రతిసారీ ప్రభుత్వ జీవోలు, ఉత్తర్వులు అమలు చేస్తామని రాత పూర్వకంగా హామీ ఇస్తున్నారు, కానీ అమలు చేయడం లేదన్నారు. పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై అంగీకరించిన అంశాలన్నింటినీ నిర్ణీత కాలపరిమితితో పరిష్కరించడానికి అంగీకరించే వరకు నిరవధిక సమ్మెలోకి వెళ్తామని స్పష్టంచేశారు. మున్సిపల్ కార్మికుల పోరాటానికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు వి.కృష్ణారావు, గొలగాని అప్పారావు, ఎస్.గణేష్, శంకర్ రెడ్డి, అనిల్, సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

విజేతలతో డివిఎస్‌వై శర్మ తదితరులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యాన విశాఖలోని రైల్వే ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన శ్రీ వెంకటేష్ మెమోరియల్ జిల్లా ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ పోటీలలో విశాఖ జిల్లాలోని వివిధ అకాడమీలలో శిక్షణ పొందుతున్న సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం ముగిసిన పోటీల్లో 11 సంవత్సరాల బాలికల విభాగంలో టి.శాన్విక, బాలుర విభాగంలో హర్షిత్, 13 సంవత్సరాల బాలికల విభాగంలో సవితశ్రీ, బాలుర విభాగంలో సుహాస్, 15 సంవత్సరాల బాలికల విభాగంలో రేణుక సత్య, బాలుర విభాగంలో అభిరామ్, 19 సంవత్సరాల బాలికల విభాగంలో రేణుక సత్య, బాలుర విభాగంలో పి.వి.మణికుమార్ విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ప్రధాన కార్యదర్శి డివిఎస్‌వై శర్మ, విశిష్ట అతిథులుగా బి.వెంకటేష్ కుమారుడు పృథ్వీ, జిల్లా వెటర్న్ సంఘం టేబుల్ టెన్నిస్ కార్యదర్శి సురాపురెడ్డి రామారావు, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి విఎస్ఎన్.మూర్తి హాజరై విజేతలకు బహుమతులను, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం సభ్యులు వి.ధనరాజు, కెఎంఎం.పాత్రో, జిబిఎస్.రామారావు, కె.శ్రీధరరాజు, కాంతరాజు, కన్నబాబు పాల్గొన్నారు.

30 నుంచి సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అంబికాబాగ్‌లోని శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 30 నుంచి జూన్ 4వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శిరీష తెలిపారు. 30వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవ సంకల్పము, ధ్వజారోహణము, 31న ఉదయం విశేష హోమాలు, 10.30 గంటలకు స్వామి కల్యాణోత్సవము, సాయంత్రం విశేష హోమాలు ఉంటాయని పేర్కొన్నారు. జూన్ 1న మహాశాంతి హోమం, 2న వైదికసదస్యం, తిరువీధి ఉత్సవం, 3న ఉదయము చూర్ణోత్సవం, అవభృదోత్సవం, చక్రస్నానం, మధ్యాహ్నం పూర్ణాహుతి, సాయంత్రం ధ్వజా అవరోహణం, 4న ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగం పవళింపు సేవ జరుగుతాయని తెలిపారు. స్వామి కల్యాణంలో పాల్గొనదలిచే భక్తులు దేవస్థానంలో రూ.300 చెల్లించి రశీదు పొందాలని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ఆర్థిక సాయం అందించాలి

దీక్షలో కూర్చున్న షిప్‌యార్డు, భెల్ యూనిట్ కార్మికులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వ రంగంలో నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ పూర్తిస్థాయిలో సమర్థవంతంగా పనిచేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణసాయంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని షిప్‌యార్డ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్ కోరారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 787వ రోజుకు చేరాయి. దీక్షల్లో షిప్‌యార్డ్, బిహెచ్ఇఎల్ ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్‌లో కొన్ని యూనిట్లను మూసివేస్తూ ఉద్దేశపూర్వకంగానే ఉత్పత్తిని తగ్గించేలా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు సమకూర్చాలని డిమాండ్‌చేశారు. ఈ దీక్షల్లో బిహెచ్ఇఎల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్, కె.నారాయణరెడ్డి, కె.ప్రభాకర్ మూర్తి పాల్గొన్నారు.

'శిష్టకరణాలను ఒబిసిలో చేర్చేందుకు కృషి'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : శిష్టకరణాలను ఒబిసిలో చేర్చేందుకు కృషిచేస్తానని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆదివారం ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి విశాఖ వచ్చిన సోము వీర్రాజును శిష్టకరణ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిలో చెప్పిన సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని సోము వీర్రాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ఉమా మహేశ్వరరావు, యువజన సంఘ రాష్ట్ర నాయకులు సన్ మూర్తి, మహిళా నాయకులు కె.పావని పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE X ADDITIONAL DISTRICT JUDGE AT ANAKAPALLI
I.A.No. 794/2022 in O.S.No. 28/2022
Between:
Jajula Satya Rao(Aadhaar Card No. 5976 5111 2175) S/o. J.Venkata Ramana @ China Ramana Late, Hindu, aged 63 years, Residing at D.No. 4-62/B, Jajulavanipalem, Desapatrunipalem Post, Paravada Mandal, Visakhapatnam-531021 (Eariler Visakhapatnam District), Anakapalli District and 4 others
. . . Petitioners
And:
(7). Jajula Jagadeesh Kumar S/o. J.Venkata Rao, Hindu, aged about 32 years, Residing at behind Ramalyam Desapatrunipalem Post, Paravada Mandal, Visakhapatnam-531021 (Eariler Visakhapatnam District), Anakapalli District ...Respondent - 7
I, M.V.Jagannadha Rao Advocate, D.No. 29-2-34, Opp. Dist. Court Main Gate, Visakhapatnam, filed the above suit i.e. I.A. 794/2022 in O.S. 28/2022 against the Respondent-7, which is pending the Honourable Court of x Additional District Judge at Anakapalle. The Respondent-7 is avoiding to take summons of the said court, therefore, this paper publication given, the ADJOURN MENT DATE is 23-06-2023 at 10-30 A.M. You or your advocate has to attend before the said court without fail or else the above suit will be deicded in your absence.
M.V.JAGANNADHA RAO
Advocate for the Petitioner
D.No. 28-234,
S.B.I.Colony, Opp. Dist Court Main Gate, Visakhapatnam.
Cell : 8074599693

- గిట్టుబాటు కాని దినసరి ఉపాధి వేతనం
- నీరు, నీడ, ఔషధాలు లేక పనిచోట అగచాట్లు
- పనిముట్లు, వేసవి అలవెన్స్‌కు మంగళం
- నిధులకు కోత పెట్టి, పథక నిర్వీర్యానికి కుట్ర

పనులు జాస్తి.. సౌకర్యాలు నాస్తి..

సింగనబంద చెరువులో మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గ్రామీణ ప్రాంతంలో కూలీలకు పని కల్పన, వలసల నివారణ లక్ష్యంతో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులను గణనీయంగా తగ్గించేసి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తనపని తాను చేస్తే, ఇక్కడ క్షేత్రస్థాయిలో ఉపాధి పనిప్రదేశంలో కనీస సౌకర్యాలు లేక కూలీలను ఇబ్బందులకు గురిచేసే చర్యలను అధికార యంత్రాంగం చేపడుతోంది. పని కల్పిస్తున్నా కూలీ గిట్టుబాటు కాక, వేతనాలు, అలవెన్సులు చెల్లింపుల్లో కోతలు పెడుతూ, పొమ్మనలేక పొగబెట్టే విధంగా కూలీలే తమంతట తాముగా ఉపాధి హామీ పథకాన్ని వద్దనుకునేలా చేస్తోందనే ఆరోపణలున్నాయి.

భీమిలి మండలంలో 3,796 జాబ్ కార్డులు ఉండగా, 5026 మంది కూలీలు ఉపాధి పని చేస్తున్నారు.మండలంలోని పలు గ్రామాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నా పనిప్రదేశంలో సౌకర్యాలే కూలీలకు ఇబ్బందికరంగా మారాయి. రేఖవానిపాలెంలో రూ.7లక్షలతో చేపల చెరువు పటిష్టం చేసే పనుల్లో 40 మంది కూలీలు పాల్గొంటున్నారు. సింగనబందలో రూ 9.50 లక్షలతో మామిడిబంద చెరువు గట్టు పటిష్ట వంతం చేసే పనుల్లో దాదాపు రెండు వందల మంది కూలీలు చేస్తున్నారు. మజ్జి పేటలో రూ.9.60 లక్షలతో ఎర్రాజీ చెరువులో 150 మంది కూలీలు పనులు చేస్తున్నారు. రూ.6.60 లక్షలతో మజ్జివలస, తాటితూరు, టి నగరపాలెం వరకు పంట పొలాలకు సాగునీరు అందించే కురపల్లి ఛానెల్ పూడికతీత పనులను 300 మంది కూలీలు చేస్తున్నారు. దాకమర్రిలో రూ.9.50 లక్షలతో మజ్జివానిచెరువు గట్టు పటిష్ట వంతం చేసే పనులను రెండు వందల మందికూలీలు చేస్తున్నారు. బోడమెట్టపాలెంలో రూ 1 50 లక్షలతో కాలువ తవ్వకం పనులు 60 మంది కూలీలు చేస్తున్నారు.

మచ్చుకైనా కానరాని సౌకర్యాలు

ఉపాధి హామీ పథకం వచ్చిన తొలినాళ్లలో పనిప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్, కూలీల పిల్లలకు సంరక్షణగా ఆయా, పనిముట్ల ఉచిత పంపిణీ, వేసవి అలవెన్సులు ఇలా ఎన్నెన్నో సౌకర్యాలను కల్పించే వారు. కానీ ప్రస్తుతం అవన్నీ మచ్చుకైనా కనిపించే పరిస్థితి లేదు. ప్రస్తుతం మండుటెండల్లో మాడు పగిలిపోయేలా పనిచేస్తున్న కూలీలకు సేదదీరేందుకు నీడనిచ్చే టెంట్లులేవు. వడదెబ్బకు గురికాకుండా ఒఆర్ఎస్, మజ్జిగలను పక్కనబెడితే, గొంతు తడుపుకునేందుకు మంచినీరు కూడా లేదు. పనిచేస్తూ, ప్రమాదవశాత్తు ఏదైనా గాయమైతే, రక్తస్రావం కాకుండా మట్టిగానీ, ఆకుపసరగానీ రాసుకోవాలే తప్ప, అయోడిన్, కాటన్ ఉండే ఫస్ట్‌ఎయిడ్ కిట్లు కానరావు.

పథకం నిర్వీర్యానికే కుట్ర!

ఇక పనిముట్ల విషయానికొస్తే, వందరోజుల ఉపాధి పనిచేసే వారికి గునపాం, పార వంటి పనిముట్లు ఉచితంగా ఇచ్చేవారు. వాటితోపనిచేస్తే ప్రత్యేక అలవెన్స్ ఉండేది. ఇపుడు పనిముట్లూ లేవు. అలవెన్స్ ఊసే లేదు. ప్రత్యేకంగా వేసవిలో ఇచ్చే అలవెన్స్ ఇపుడు చెల్లించడం లేదు. ఇలా నిధులు, సౌకర్యాలన్నీ ఒక్కటొక్కటిగా కట్ చేస్తూ, చివరకు పథకానికి మంగళం పాడే చర్యలనే ప్రభుత్వం చేస్తోందని కూలీలతోపాటు ప్రజాసంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

గరిష్ట వేతనం అందుకోవడం గగనమే

ఉపాధి పనివేళల్లో మార్పులు, ఇతర సంస్కరణల పుణ్యమాని కూలీలు రోజువారీ చేసిన పనికి గరిష్టవేతనం అందుకోవడం గగనమనే చెప్పాలి. మారిన నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం వేళల్లో పనిచేస్తే రోజుకు గరిష్ట వేతనం రూ.272 చెల్లిస్తారు. అయితే చేసిన పని ఆధారంగా చెల్లింపులు ఉండడంతో గరిష్ట వేతనం సంపాదించడం కూలీలకు కష్టంగానే ఉందని అంటున్నారు. మరోవైపు కూలీలు, కార్మికసంఘాలు ఉపాధి వేతనాన్ని రోజుకు కనీసం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేస్తుంటే, ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన వేతనం ఇచ్చే పరిస్థితి లేదని కూలీలు వాపోతున్నారు. గతంలో వేసవి అలవెన్స్, పనిముట్ల అలవెన్స్, కూలీల నైపుణ్యత ఆధారంగా అదనపు కూలి డబ్బులు ఇచ్చే పరిస్థితి ఉన్నా, ఇపుడవన్నీ రద్దు చేసేశారు. ఇప్పటికైనా ఉపాధి హామీ పథకాన్ని నాటి యుపిఎ ప్రభుత్వం ఏ లక్ష్యంతో ప్రారంభించిందో, దానికంటే అదనపు ప్రయోజనాలు కల్పించకున్నా, ఉన్నవాటికి ఎసరు పెట్టకుండా ప్రస్తుత బిజెపి ప్రభుత్వం అమలు చేయాలని కూలీలు కోరుతున్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలేవి?

పని ప్రదేశంలో ఎటువంటి సౌకర్యాలూ లేవు. ఎండలో పనిచేసే సందర్భంలో విశ్రాంతి టెంట్ లేదు. దాహార్తి తీర్చేందుకు పక్కనబెడితే, ఎండకు స్పృహతప్పి పడిపోయినా ముఖాన చల్లేందుకు నీరు లేదు. ఇలాగైతే ఎలా పనిచేయగలం?

కరుబోతు కొండమ్మ, ఉపాధి కూలి, సింగనబంద

జాబ్‌కార్డున్న వారందరికీ ఉపాధి

జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పథకం కింద పని కల్పిస్తూ, నిర్ణీత సమయంలోనే వేతనాలు చెల్లిస్తున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.60లక్షల పని దినాలు కల్పించాలన్నది లక్ష్యం కాగా, ఏప్రిల్, మే నెలల్లో 70 వేల పని దినాలు కల్పించాం. రూ కోటి 61 లక్షల వేతనాలు చెల్లించాం. జాబ్ కార్డు ఉన్న వారికి ఏడాదిలో 100 రోజులు పని, తాగునీటికి రెండు లీటర్లకు రూ.10, వారంలో ఒకసారి గునపాం పదును పెట్టేందుకు రూ.ఐదు అలవెన్సును వేతనంతో కలిపి ఇస్తున్నాం.

జి వెంకటగౌరి, ఎపిఒ
ఎన్ఆర్ఇజిఎస్, భీమునిపట్నం

గాయమైతే అంతే సంగతులు

పనిచేస్తుండగా గాయమైతే ప్రథమ చికిత్స చేసేందుకు కాటన్ గానీ, అయోడిన్ గానీ అందుబాటులో లేదు. పని చోటు నుంచి ఆసుపత్రికి వెళ్లాలంటే ఐదారు కిలోమీటర్లు దూరం. ప్రస్తుతం వేసవిలో ఉదయం ఆరుగంటల్లోపే పనికెళ్లి, 11గంటల్లోగా ఇంటికి చేరుతున్నా, మధ్యలో జ్వరం, తలనొప్పి వస్తే మందులిచ్చే దిక్కులేదు.

గాడు లక్ష్మి, ఉపాధి కూలి, సింగనబంద

విద్వేషాలు కలిగించే ఫ్లెక్సీలపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం: ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా రాజకీయపార్టీలు ఫ్లెక్సీలు పెట్టడం, రెచ్చగొట్టే చర్యలు చేపట్టడం సరికాదని జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ అన్నారు. ఆనందపురం కూడలిలో పవన్‌కల్యాణ్ చంద్రబాబులను ఉద్దేశించి, పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం అంటూ జగన్ ఫోటోతో వైసిపి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన, ధర్నా చేపట్టారు. ఇటువంటి ఫ్లెక్సీల వల్ల శాంతియుతంగా ఉన్న ప్రజల మధ్య విభేదాలు రేగే అవకాశం ఉందని, ప్రజల్లో ద్వేషాలు రగిలించే చర్యలు చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పాలవలస యశస్వి, శాఖరి శ్రీనుబాబు, చంద్రరావు, పరిమి భువనేశ్వరి, దుక్క వెంకటరావు, దేవి, రామలక్ష్మి, నాగేశ్వరరావు, రౌతు నాగరాజు, యశోద , గోవింద్ పాల్గొన్నారు.

మత్స్యకారుల నిరసన

నిరసన చేపడుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్త పైపులైన్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకారులు డిమాండ్ చేశారు. పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన మహా శాంతియుత ధర్నా 543 రోజుల కు చేరింది. శిబిరం వద్ద ఆదివారం పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు గొంతిక పై కత్తులు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ మత్స్యకారుల ఉపాధిని దెబ్బ కొట్టే పైపులైన్ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి నానాజీ, గోసల స్వామి, చేపలు సోమేష్, పిక్కి రమణ, బొంది నూకరాజు, మైలపల్లి దాత్రరాజు, పిక్కి కోటి, వాసు పిల్లి దేముడు, పిక్కి కాశీ, కందాల నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ భవనాన్ని మోడీ ప్రారంభించడాన్ని వ్యతిరేకించడం సరికాదు

ప్రజాశక్తి -కలెక్టరేట్, విశాఖ : నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రధాని మోడీ ప్రారంభించడాన్ని కొన్ని పార్టీలు వ్యతిరేకించడం సరికాదనిని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. రాజస్థానీ మండలిలో ఆదివారం బిజెపి ఆధ్వర్యాన ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం అనంతరం సోము వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ, ద్రౌపది ముర్మును రాష్ట్రపతి పదవికి బిజెపి ప్రతిపాదిస్తే, ఆమెకు ఆ పదవి ఇవ్వకూడదంటూ వ్యతిరేకించిన రాజకీయ పార్టీలే ఇపుడు నూతన పార్లమెంట్ భవనాన్ని ఆమెతో ప్రారంభింపచేయలేదని తప్పుపడుతున్నాయన్నారు. ఎన్టీఆర్ గొప్పతనాన్ని మన్ కి బాత్‌లో ప్రధాని మోడీ ప్రస్తావించారని, ఇది తెలుగు వారందరికీ గర్వకారణం అన్నారు. ఏపిలో జనసేన పార్టీ తమతో ఉందని, మిగిలిన పార్టీల ప్రతిపాదనలను కేంద్ర పార్టీ చూసుకుంటుందని చెప్పారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివిఎన్ మాధవ్, విశాఖపట్నం అధ్యక్షుడు ఎం.రవీంద్ర పాల్గొన్నారు.

జి20 దేశాల్లో మహిళా సాధికారికతకు భారత్ మార్గదర్శకం

ప్రజాశక్తి-విశాఖపట్నం : మహిళాసాధికారికత, ఆర్థిక ప్రగతిలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే ఆయాదేశాలలో వృద్ధి కనబడుతుందని, దీనికి గాను భారతదేశం త్వరలో ఆతిథ్యం ఇవ్వనున్న జి20 సమావేశాలలో మార్గదర్శకం చేయాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ డైరక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్‌సి.పాండే నన్నారు. భారత ప్రజాసంబంధాల సంఘం (పిఆర్‌ఎస్ఐ) విశాఖ శాఖ, స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా నిర్వహించిన 'జి20 మహిళాసాధికారికత-భారతదేశ పాత్ర అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు.

ఆధునికీకరించిన పిల్లల పార్కు ప్రారంభం

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో వార్డు అభివృద్ధి ప్రణాళిక నిధులు రూ.ఏడు లక్షలతో ఆధునీకరించిన పిల్లల పార్కును వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర ఛైర్మన్ కె.కె.రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని పార్కులన్నింటినీ అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు, పెద్దలు అందరూ సేదదీరేందుకు, ఉపశమనం, విశ్రాంతి కోసం అన్ని సౌకర్యాలుండేలా పార్కులను తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. అనంతరం దాడి రమణమూర్తి కళ్యాణ మండపం వద్ద మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఇ శ్రీనివాస్, ఎఇ రమణమ్మ, జక్కంపూడి సత్యనారాయణ, బైర వెంకట్, పారుపల్లి రవి, యస్.కుమార్, రమణ, నరేష్, రమణబాబు, సచివాలయం కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక రెసిడెంట్స్, అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

ఉల్లాసంగా వేసవి శిక్షణ శిబిరాలు

విద్యార్థులకు వివిధ రకాల పోటీలు

ప్రజాశక్తి- సింహాచలం: అడవివరం శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందించే విధంగా వివిధ రకాలైన వ్యర్థాలతో సృజనాత్మక వస్తువులు తయారీలోనూ, పేపర్ క్రాఫ్ట్ ద్వారా వస్తువుల తయారీలో శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నరసింహం, బాలు, ఎల్లమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

గొలుగొండ : స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులకు దేశభక్తి గేయాలపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి నిర్వహించిన పోటీల్లో వారు ఆలపించిన దేశభక్తి గేయాలు అలరించాయి గ్రంథాలయ అధికారి ఎన్.రాజబాబు మాట్లాడుతూ పోటీలలో విజేతలకు వచ్చే నెల 11న బహుమతులు అందజేస్తామన్నారు.

సింహాచలంలో ప్రతిభ చూపిన చిన్నారులకు అభినందన

కోటవురట్ల : వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయం ప్రయోజనాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి అప్పలనాయుడు పుస్తక పఠనంపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు మస్తాన్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేత చేపలుప్పాడ జట్టు

విజేతలకు కప్ అందజేస్తున్న వైస్ ఎంపిపి ధనలక్ష్మి

ప్రజాశక్తి -ఆనందపురం : ముత్యాలమ్మ మరిడిమాంబ పండగ సందర్భంగా మండలంలోని వెల్లంకి పంచాయతీ, గారపేటలో శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిసాయి. 15 రోజులపాటు, 50 క్రికెట్ జట్లు పాల్గొన్న ఈ టోర్నీ విజేతగా చేపలుప్పాడ జట్టు నిలిచింది. రన్నరప్‌గా బోయిపాలెం జట్టు నిలిచింది. విజేతలకు రూ.15వేలు, రన్నరప్‌కు రూ.పది వేలు నగదు బహుమతితోపాటు ట్రోఫీలను వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ అందజేశారు. ఈ టోర్నీలో బహుమతులకు అవసరమైన ధనాన్ని వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, ఉపసర్పంచ్ కంచరపు శ్రీనివాసరావు, తాళ్లవలస ఎంపిటిసి కోరాడ రమణ, వెల్లంకి ఎంపిటిసి పడాల అప్పలనాయుడు సమకూర్చారు. బహుమతి ప్రదానోత్సవంలో శ్రీకృష్ణ యాదవ యూత్ సభ్యులు, గ్రామపెద్దలు, పైడితల్లి రామకృష్ణ గోవింద, నర్సింగరావు పాల్గొన్నారు

వ్యక్తిగత ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవిందు అన్నారు. ఆదివారం దుర్గా గణపతి గుడి సీతంపేట యశోదాకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో, అమెరికన్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనిఒత్తిడి కారణంగా పనుల్లో బిజీగా ఉండడం వల్ల ప్రస్తుతం అనేకమంది తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది ఎంతమాత్రం మంచిదికాదన్నారు. వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు.

ఈ సందర్భంగా 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ .బి. శ్రీకాంత్ జనరల్ ఫిజీషియన్స్ డాక్టర్ జాన్ సూరజ్, డాక్టర్. సుగుణ ఆంకాలజిస్ట్ డాక్టర్ రవీంద్రకుమార్ పీడియాట్రీషియన్ డాక్టర్ సంతోష్ పాల్గొని వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ముద్దాడ ఎల్లాజీ, బీసపు శ్రీను, పిల్లల మోహన్, పల్లా పాపారావు, నాయుడు మాస్టర్, జోగ శ్రీను, ముద్దాడ శంకర్, పల్లా రాము, ఒమ్మి చిన్న, ఉప్పిలి అప్పన్న, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సేవల్లో ఆదర్శంగా నిలవాలి

మజ్జిగ పంపిణీ చేస్తున్న కళింగ యూత్ జూనియర్స్

ప్రజాశక్తి- మాధవధార: కళింగ యువత సేవా కార్యక్రమాలు చేస్తూ పలువురుకి ఆదర్శంగా నిలవాలని మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నంబాళ్ల ఈశ్వరరావు పిలుపునిచ్చారు. వేసవి దృష్ట్యా మాధవ యువజన సమాజం ఆవరణలో, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు నెలలుగా నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రంలో వద్ద ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు నంబాళ్ల ఈశ్వరరావు మాట్లాడుతూ, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, జూనియర్ సభ్యుల ఆర్థిక సాయంతో ఏటా వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఆనవాయితీగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ వారం దాతల సహకారంతో జూనియర్ సభ్యులు చలివేంద్రాన్ని విజయవంతంగా నిర్వహించడంపై అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

నెలరోజులు తిరక్కుండానే నిండా గోతులు!

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం
అవస్థలు పడుతున్న వాహనదారులు
పట్టించుకోని జివిఎంసి అధికారులు

నూతనంగా నిర్మించిన రోడ్డులో ఏర్పడ్డ గోతులు

ప్రజాశక్తి -గాజువాక : అధికారుల పర్యవేక్షణాలోపం, నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం వల్ల లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన తారురోడ్డు నెలరోజులు తిరక్కుండానే గోతులమయమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం కొన్ని నెలలపాటైనా ఉండాల్సిన రోడ్డు, రోజుల్లోనే పాడవ్వడంపై వాహనదారులు, స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత జివిఎంసి అధికారులు స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గాజువాక జివిఎంసి జోన్ పరిధిలోని జగ్గు జంక్షన్ నుంచి గంగవరం పోర్ట్‌కు వెళ్లే రహదారిలో నెలరోజుల క్రితమే రూ. 25 లక్షల జివిఎంసి నిధులతో తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇంతలోనే రోడ్డుపొడుగునా పలుచోట్ల గోతులు ఏర్పడడంతో వాహనదారులు, ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నిర్మాణ పనుల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్లే కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగాపనులు చేశాడని, దీంతో రోజుల వ్యవధిలోనే రోడ్డుల్లో గోతులేర్పడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గంగవరం పోర్టుకు వెళ్లే వాహనాలతోపాటు గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే ఉద్యోగులతో నిత్యం ఈమార్గంలో ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పునర్నిర్మించిన రోడ్డు కొద్దిరోజుల్లోనే పాడవవ్వడంపై పలువురు మండిపడ్డారు. రోడ్డు బాగా ఉందని, కాస్త వేగం పెంచి ప్రయాణించిన వాహనదారులు ఇద్దరు ప్రమాదానికి గురై గాయాల పాలైన ఘటన చోటుచేసుకుందని అంటున్నారు. అంతేకాక కాస్త చీకటి పడితే ఈ మార్గంలో వీధిదీపాల వెలుగులు లేకపోవడంతో రాకపోకలకు మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి, మూన్నాళ్లకే పాడైన రోడ్డును బాగుచేయించడంతోపాటు ఈ మార్గంలో వీధిదీపాలు వేయించి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

విజయవంతమైన వేసవి శిబిరం

త్రిఫ్ట్‌సొసైటీ, విసిసి ఆధ్వర్యాన నిర్వహణ
ఉత్సాహంగా పాల్గొన్న సొసైటీ సభ్యుల పిల్లలు

ఆటపాటల్లో పాల్గొన్న సభ్యుల పిల్లలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ త్రిఫ్ట్ సొసైటీ, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన సొసైటీ సభ్యుల పిల్లలకు రెండు రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విజయవంతమైంది. ఆదివారం ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల నుంచి 70 మంది సొసైటీ సభ్యుల పిల్లలు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఈ క్యాంపులో సమాజ పరిణామ క్రమం, శాస్త్రీయ ఆలోచన, నిత్యజీవితంలో సైన్సు, ఆచరణ, పిల్లల కోసం ఎందుకు పనిచేయాలి అనే అంశంపై వివరించారు. దీనితో పాటు గ్రూపు ఆక్టీవిటీలు, మైమ్, క్రాఫ్ట్, డాన్సు, పాటలు, పొడుపు కథలు విప్పి చెప్పడం వివిధ రకాలైన అంశాల్లో అవగాహన పోటీలను నిర్వహించారు. విజ్ఞాన అంశాలను డిసిహెచ్. వెంకటేశ్వరరావు, ఎవి.సత్యనారాయణ వివరించారు. విసిసి కన్వీనర్ కె. సుశీల, కె. రమాప్రభ పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా సొసైటీ సెక్రటరీ పి నారాయణరావు మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని అందించే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు రూపొందించామని వెల్లడించారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సమ్మర్ క్యాంపులో పాల్గొన్న పిల్లలకు విసిసి తరఫున జ్ఞాపికలు అందజేశారు. డైరెక్టర్లు కె.సత్యవతి, ఎ.అప్పారావు, జి.శ్రీనివాస్, డి.ప్రవీణ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో నమ్మిదొడ్డి, పరవాడ, వడ్లపూడి, గంట్యాడ, శ్రీనగర్, మదీనాబాగ్, ఇస్లాంపేట, లక్ష్మినగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల పిల్లలు పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న త్రిఫ్ట్ సొసైటీ సభ్యులు

ఉపాధ్యాయుల ప్రమోషన్లలో నిబంధనలు పాటించాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉమ్మడి విశాఖ జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలలో గత సాంప్రదాయాలను పాటించి, మాన్యువల్‌గా నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంవి.కృష్ణారావు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఖాళీలు ఎక్కడున్నాయో చూపకుండా ప్రమోషన్లు వద్దనుకునేవారు రాత పూర్వకంగా అన్‌విల్లింగ్ తెలపాలని ఆంక్షలు విధిస్తున్నారన్నారు. గతం కంటే భిన్నంగా సాగుతున్న ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టే అధికారుల ధోరణివల్ల అనేక మంది ఉపాధ్యాయులు నష్టపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అలాగే ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్నింటినీ ప్రకటించాలని, బదిలీల జిఒలో ఉన్న అసంబద్ధ అంశాలకు సవరించాలని కోరారు. నిబంధనలు పాటించకపోతే సోమవారం నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గోపాలపట్నంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 32 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో మరోమారు ఆత్మీయ సమ్మేళనమయ్యారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా వివిధ ప్రాంతాల్లో వత్తి ఉద్యోగం వ్యాపారరీత్యా స్థిరపడిన వారంతా అక్కడికి చేరుకుని కలుసుకున్నారు. ఈసందర్భంగా ఒకరినొకరు పలకరించుకుని, పరస్పరం ఆలింగనం చేసుకుని, క్షేమసమాచారాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో జరిగిన జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకొని సంతోషంగా గడిపారు. తోటి మిత్రులు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలుసుకొని హర్షాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సహఫంక్తి భోజనాలు చేశారు.

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో నిత్య కల్యాణాన్ని ఆలయ అర్చకులు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించే తిరువీధి ఉత్సవంలో భాగంగా దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు పాల్గొని స్వామి పల్లకిని మోసారు. కల్యాణం అనంతరం వేడుకలో పాల్గొన్న భక్తులకు స్వామి దర్శనానికి కల్పించి, ప్రసాదాన్ని, జాకెట్‌ను, కండువాలను ఆలయ అధికారులు అందించారు.

ఉత్సాహంగా 'పర్యావరణ పరిరక్షణ' సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి- ఉక్కునగరం : ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలకు నాందిగా ఉక్కునగరం తృష్ణ గ్రౌండ్‌లో ఆర్ఐఎన్ఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పర్సనల్ డాక్టర్ ఎస్‌సి.పాండే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా "ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో సాధ్యమయ్యే అన్ని మార్పులను చేసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ, ప్రాముఖ్యతపై కుటుంబసభ్యులు, స్నేహితులు, ఇతరులను చైతన్యపరచడానికి నిరంతరంకట్టుబడి ఉండానని సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. వచ్చేనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న స్టీల్‌ప్లాంట్ పర్యావరణ నిర్వహణ విభాగాన్ని అభినందించారు. సహజ వనరులు, పర్యావరణం, వ్యక్తిగత ఆరోగ్యం కాపాడాలని నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. తృష్ణ మైదానం నుంచి, ఉక్కునగరం టౌన్‌షిప్‌లోని వివిధ సెక్టార్‌ల మీదుగా సాగిన ఐదు కిలోమీటర్ల సైకిల్ ర్యాలీలో పిల్లలు, యువకులు, పర్యావరణ నిర్వహణ విభాగం సీనియర్ అధికారులు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైకిల్ ర్యాలీ పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలను ఉక్కు పర్యావరణ నిర్వహణ విభాగం ఇన్‌ఛార్జి, విభాగాధిపతి జి. ఫణికుమార్ అందించారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పర్సనల్ డాక్టర్ పాండే

ఉపాధి హామీ కూలీల సమస్యలపై

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- అనకాపల్లి

ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా తదితర సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కొలతలతో సంబంధం లేకుండా కనీస కూలి రోజుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.272 ఇవ్వాలని, ప్రతి ఒక్కరికి 200 పని దినాలు కల్పించాలని, గతంలో ఉన్న సదుపాయాలు సమ్మర్ అలవెన్స్, పనిముట్లకు డబ్బులు, మంచినీరు, టెంట్, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో నిధులు కేటాయించి పేదలకు పనులు కల్పించాలని, మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటు ఉంచాలని, రోజుకి రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సెల్ ఫోన్లు సరఫరా చేయాలని, మేట్లకు శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని కోరారు.

ఉపాధి హామీ నిర్వీర్యానికి కుట్ర

కె.కోటపాడు : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ప్రతి ఏటా నిధులు తగ్గిస్తూ దాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని సిసిటియు జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము విమర్శించారు. మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో బండారి వారి చెరువు వద్ద ఆదివారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు కలిశారు. వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంలో ఉపాధి హామీ నిధులు 2023 సంవత్సరంలో రూ.60 లక్షల కోట్ల కుదించడం జరిగిందన్నారు. తక్షణమే ఉపాధి హామీకి నిధులు రెండు కోట్ల 40 లక్షల రూపాయలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల సమస్యలపై సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి. ఈ.నాయుడు బాబు, ఉపాధి కూలీలు సూరెడ్డి నారాయణమూర్తి, కర్రి శ్రీరాములు, కర్రి చంద్రి, ఈ దేవుడు నాయుడు, పైడిబాబు, బొడ్డ తాతము నాయుడు, పట్నాల ఈశ్వరరావు, సూరెడ్డి సత్యనాయుడు, వేమల లక్ష్మి, సూరెడ్డి వరలక్ష్మి, ఉపాధి కూలీలు, మేట్లు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న రాము, నాయుడుబాబు

పైలా ప్రసాదరావును సత్కరిస్తున్న చంద్రబాబు

పైలా ప్రసాదరావుకు సత్కారం

ప్రజాశక్తి- కె.కోటపాడు

తెలుగుదేశం పార్టీ సంక్షేమ నిధికి కోటి రూపాయలను విరాళంగా అందించిన ఆ పార్టీ మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావును మహానాడు వేదికగా టిడిపి అధినేత చంద్రబాబు సత్కరించారు. శనివారం మహానాడులో చంద్రబాబు తెలుగుదేశం పార్టీ, కార్యకర్తల సంక్షేమం కోసం విరాళాలు అందించిన వారి పేర్లు చదువుతూ పైలా ప్రసాదరావు కోటి రూపాయల విరాళం అందించడం అభినందనీయమని, పార్టీకి అండగా నిలిచిన వీరి సేవలు స్ఫూర్తిదాయకమని ప్రసంశల జల్లు కురిపించారు. గట్టిగా చప్పట్లు కొట్టి అభినందనలు తెలియజేయాలని కార్యకర్తలను కోరి, హర్షధ్వానాల మధ్య చంద్రబాబు అభినందనలు తెలియజేశారు. విరాళాలు అందించిన దాతలతో చంద్రబాబు ప్రత్యేకంగా విందు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో చంద్రబాబు పైలాను శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ చంద్రబాబు, నారా లోకేష్ అడుగుజాడల్లో పయనిస్తూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు.

టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

2022-2023 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ఆదివారం సుంకర కళ్యాణమండపంలో అభినందన సభ, సన్మాన కార్యక్రమం గంగలకుర్తి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలో పదో తరగతిలో ఫస్ట్, సెకండ్, థర్డ్ వచ్చిన విద్యార్థులు దోసరి హస్విత, పుడి పూర్ణిమ నవర దీక్షితను ఘనంగా సత్కరించి ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. వీరితోపాటు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన మరో ఎనిమిది మంది విద్యార్థులను సత్కరించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైసిపి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. దోసూరు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య రాంబాబు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించిన నిర్వాహకులు

పేదల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో పేదల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. స్థానిక 82వ వార్డు పరిధి పాత కరెంట్ ఆఫీస్ వీధి, టెలిఫోన్ ఎక్స్చేంజ్ వీధి, జివి కోటేశ్వరరావు వీధి, శ్రీధర్ లాడ్జి ప్రాంతాల్లో ఆదివారం వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు జానకిరామరాజు, వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత నేతృత్వంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మంత్రి అమర్నాథ్ గడపగడపకు వెళ్లి ప్రభుత్వ లబ్ధి పత్రాలు పంపిణీ చేశారు. కాలువలపై పలకలు వేయాలని, బర్మా కాలనీలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని మంత్రి అమర్నాథ్ దృష్టికి తీసుకురాగా సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీనికి ముందు 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న విద్యా కానుక కిట్లను అమర్నాథ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ జి రామ్మూర్తి, పార్టీ నాయకులు పలక సత్యనారాయణ, కుండ్ల రామకృష్ణ, ఉగ్గిన అప్పారావు, గున్నబత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి- వడ్డాది

ఖరీఫ్ సీజన్‌లో వరి పంట వేసే రైతులు విత్తనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని లోవూడి సచివాలయ వ్యవసాయ సహాయకురాలు బ్లేసీ రత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్-2023 వరి విత్తనాల రిజిస్ట్రేషన్ ఈ నెల 29 నుండి ప్రారంభమవుతుందని, విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బికెకె వచ్చి పేర్లు నమోదు చేసుకొని డబ్బులు జమ చెయ్యాలని కోరారు. రైతులు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు ఆర్‌జిఎల్-2537 (శ్రీకాకుళం సన్నాలు) 30 కేజీలు రూ.850, బిపిటి-3291 (సోనా మసూరి) 30 కేజీలు రూ.830, బిపిటి 5204 (సాంబ మసూరి) 25 కేజీలు రూ.710, ఎంటియూ 7029 (స్వర్ణ) 30 కేజీలు రూ.850, ఎంటియూ 1064 (అమర) 30 కేజీలు రూ.860 ధర చెల్లించాలని తెలిపారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని రాస్తారోకో

భారీ వాహనాల రాకపోకలు నిలుపుదల చేయాలని డిమాండ్

ప్రజాశక్తి- మునగపాక రూరల్

ప్రమాదాలకు నిలయంగా మారిన అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు మార్గంలో భారీ వాహనాలు నిలుపుదల చేయాలని, రోడ్డు మరమ్మతులు తక్షణం చేపట్టాలని ఆదివారం మండల కేంద్రం మెయిన్ రోడ్డులో ప్రజా సంఘాల నాయకులు, యువకులు రాస్తారోకో చేపట్టారు. పెద్ద ఎత్తున నిరసన తెలియ చేశారు. గంటలపాటు మండే ఎండలో బైఠాయించి వాహనాలను దిగ్బంధించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ రోడ్డు గతుకుల మయమై దుమ్ము, ధూళితో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, భారీ వాహనాలు కనీస సేఫ్టీ లేకుండా పెద్ద పెద్ద బండరాళ్లతో వెళ్లడం ఆ రాళ్లన్నీ రోడ్లపై పడటం జరుగుతోందని తెలిపారు. బొగ్గు, పిక్క, ఇసుక వంటి లోడ్లతో భారీ వాహనాలు నడవడంతో అనేక ప్రమాదాలు జరుగుతూ నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి రోడ్డు మరమ్మతులు చేయకుండా అదిగో చేస్తాం, ఇదిగో విస్తరణ చేస్తాం అంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తుందే తప్ప ప్రయాణికుల ఇక్కట్లను కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. భారీ వాహనాలు రాకూడదని ఆర్ అండ్ బి అధికారులు బోర్డులు పెట్టినా పట్టీపట్టనట్లు వాహనదారులు యథేచ్ఛగా తిప్పుతున్నారన్నారు. నిబంధనల ప్రకారం పది నుండి 15 టన్నులు లోడుతో వెళ్ళాల్సిన వాహనాలు 60 టన్నుల పైబడిన లోడుతో తిరగడంతో రోడ్డు మరింత దుర్భరస్థితికి చేరుకుందన్నారు. ఇదే రోడ్డు మార్గంలో మునగపాక, హరిపాలెం బ్రిడ్జిలు బ్రిటిష్ హయాంలో నిర్మించడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పరిమితికి మించి వెళుతున్న వాహనాల వలన ముప్పు పొంచి ఉందని పేర్కొన్నారు. వీటిపై ఆర్‌టీఓ, ఆర్ అండ్ బి, పోలీసు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు స్పందించి సకాలంలో తగిన చర్యలు తీసుకోకపోతే రోడ్డు మార్గాన్ని పూర్తిగా దిగ్బంధిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆందోళనకారులు పోలీస్ స్టేషన్ చేరుకుని ఎస్సై మహమ్మద్ అలీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు వివి శ్రీనివాసరావు, ఎస్ బ్రహ్మాజీ, ఏఎన్‌వి మహేష్, వేగి కుమార్, సరగడం జగన్, దాడి సాంబశివ, కాండ్రేగుల మహాలక్ష్మి నాయుడు, ఆడారి దేవకి, ఎం భాస్కర్, ఎస్ సాజన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఉత్తేజంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్

వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఉపాధ్యాయులు శివకోటి దుర్గాప్రసాద్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇటువంటి పోటీలలో పాల్గొనడం వలన విద్యార్థుల్లో పోటీ తత్వంతో పాటుగా మేధోశక్తి పెరుగుతుందని తెలిపారు. గ్రంథాలయ అధికారి ఎల్వి రమణ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పెంటకోట తులసిరావు, ఉపాధ్యాయులు పిల్ల జగదీష్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

430 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం

బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 107వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 430 మందికి రోగులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 322 మందికి ఉచితంగా అద్దాలను అందించి, మిగతా 70మందికి మందులు పంపిణీ చేశారు. 46మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. మిగిలినవారికి 108వ శిబిరానికి రావాలని టోకెన్లు ఇవ్వడం జరిగింది. ఈ ఉచిత కంటి వైద్య శిబిరం శంకర్ ఫౌండేషన్ విశాఖపట్నం వారితో కలసి నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వచ్చినవారికి మజ్జిక, పలహారాలు, భోజనం సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ ఇండియా ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహానాడుకు తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి- అనకాపల్లి

రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడుకు అనకాపల్లి నియోజవర్గం నుండి టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లాయి. పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు ఆధ్వర్యంలో 12 బస్సులు, 32 కార్లలో మహానాడుకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ నారాయణరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, నడిపల్లి గణేష్, కడిమిశెట్టి నర్సింగరావు, షేక్ బాబర్, కుప్పిలి జగన్మోహన్రావు, కోట్ని రామకృష్ణ ఇతర నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : టిడిపి మహానాడుకు మండలంలోని టీడీపీ నేతలు భారీగా తరలివెళ్లారు. రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి బర్ణికాన సాయినాధరావు ఆధ్వర్యంలో కె.రామకృష్ణ రాజు, గవర అప్పారావు, గవర సత్యనారాయణ, పల్లా తాతారావు, రాపర్తి బాబురావు, పిల్లల అప్పల నాయుడు, ఈపు అప్పలరాజు తదితరులు వెళ్లారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎపి జెఎసి అమరావతి మూడవ దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం ఉద్యోగుల వేదనను చెబుదాం అనే నినాదంతో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను ఉద్యోగులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు సింగంపల్లి వాసు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 4 డిఎ ఎరియర్స్, 11వ పిఆర్‌సి కమిషన్ రికమెండ్ చేసిన పే స్కేల్స్, పిఆర్‌సి ఎరియర్స్, పెండింగ్‌లో ఉన్న 2 డిఎలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రకటించినట్లుగా సిపిఎస్‌ను రద్దు చేయాలని ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.లోవరాజు, పీవీ రత్నం, వై. శ్రీరామ్మూర్తి గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి -పరవాడ

మండలంలోని రాంకీ ఫార్మసిటీకి ఆనుకుని ఉన్న వినాయక నగర్ బ్యాంక్ కాలనీ వద్ద నెలకొల్పిన తుక్కు గొడౌన్‌లో శనివారం అర్ధరాత్రి సుమారు 2.30, 3 గంటల సమయంలో అగ్ని ప్రమాదాం సంభవించింది. వందల టన్నులు వ్యర్ధాలకు మంటలు వ్యాపించడంతో శనివారం రాత్రి నుండి ఆదివారం మధ్యాహ్నం వరకు ఐదు అగ్నిమాపక శకలాలతో మంటలను అర్పుతున్నా అదుపులోకి రాలేదు. సంఘటన స్థలాన్ని సిఐ పి.ఈశ్వరరావు తన సిబ్బందితో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. ఏపీఐఐసీ ఫైర్ డిపార్ట్మెంట్ అనకాపల్లి రేంజ్ ఆఫీసర్ బి నర్సింగరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఎటువంటి అనుమతులు లేనందున ఈ తుక్కు వ్యాపారం నిర్వహిస్తున్న యజమానిపై తగు చర్య నిమిత్తం నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. సంఘటన స్థలాన్ని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ సందర్శించి ప్రమాదం భారీగానే జరిగిందని, ప్రమాదానికి కారణమైన తుక్కు వ్యాపారం నిర్వహిస్తున్న యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా పరవాడ ప్రాంతంలో పుట్టగొడుగుల్లా తుక్కు వ్యాపారాలు నిర్వహిస్తున్న యజమానిపై పోలీసులు రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

స్క్రాప్ దుకాణం నుంచి పెద్ద మొత్తంలో వస్తున్న పొగ

అనుమతుల్లేని స్క్రాప్ దుకాణం

రాంకీ ఫార్మసిటీ యాజమాన్యం గత కొన్ని సంవత్సరాలుగా అనధికారికంగా ఎటువంటి అనుమతులు లేని ఒక ప్రైవేటు వ్యక్తి చేత స్క్రాప్ దుకాణం ఏర్పాటు చేయించింది. వివిధ ఫార్మా కంపెనీల వ్యర్థాలు, పాలిథిన్ బ్యాగ్స్, డ్రమ్ములు, బాటిల్స్ వివిధ కెమికల్స్ వ్యర్థాలను ఇక్కడ డంపింగ్ చేస్తున్నారు. ఈ వ్యర్ధాలు అన్ని విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ పడవేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఫార్మా వ్యర్ధాలను రాంకీ యాజమాన్యం శుద్ధిచేసి, వివిధ పాలిథిన్ బ్యాగ్‌లు, డ్రమ్ములు, ఇతర తుక్కు వ్యాపారస్తులకు విక్రయించారు. అలా కాకుండా రాంకీ యాజమాన్యమే ఒక వ్యక్తిని స్క్రాప్ దుకాణం నడపమని చెప్పి వారికి ఫార్మా వ్యర్థాలు అన్ని స్క్రాప్ రూపంలో విక్రయిస్తున్నారు. స్క్రాప్ దుకాణం ఏర్పాటు చేయాలంటే పోలీస్, రెవెన్యూ, ఫైర్ సర్వీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఇలా అన్ని డిపార్ట్మెంట్లు అనుమతులు తీసుకోవాలి. దీనికి ఎలాంటి అనుమతులు లేవు. పుట్టగొడుగుల్లా పరవాడ ప్రాంతంలో తుక్కు దుకాణాలు ఏర్పాటు చేశారు.

అపహరణకు గురైన

11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి- అనకాపల్లి

అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, బి.విజయభాస్కర్, నర్సీపట్నం ఇన్‌ఛార్జి అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్ కుమార్ వివిధ ప్రాంతాల్లో దొంగతనానికి గురైన రూ.8 లక్షల విలువైన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్ డివిజన్‌లోని నర్సీపట్నం టౌన్, నర్సీపట్నం రూరల్, మాకవరపాలెం, కశింకోట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల జరిగిన ద్విచక్ర వాహనాల దొంగతనాలపై విచారణ చేపట్టామన్నారు. అనకాపల్లి సిసియస్ పోలీసులు, నర్సీపట్నం టౌన్ పియస్ సిఐ ఎన్.గణేష్, సిబ్బంది బృందాలుగా ఏర్పడి ముందస్తు సమాచారం మేరకు ఈనెల 28న నర్సీపట్నం మున్సిపాలిటి పరిధిలో బైపురెడ్డి పాలెం, ఐ.టి.ఐ జంక్షన్ దగ్గర కసిమి రోడ్డు నుండి నర్సీపట్నం వైపు మోటారు సైకిల్స్ పై వస్తున్న ఆరుగురు వ్యక్తులను అనుమానంపై అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందని చెప్పారు. మాకవరపాలెం మండలం పైడిపాల గ్రామానికి చెందిన నలుగురు మైనర్ బాలురు నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలో నర్సీపట్నం టౌన్-6, నర్సీపట్నం రూరల్-2, మాకవరపాలెం-1, కశింకోట-1, కాకినాడ జిల్లా పిఠపురం ఏరియాలలో-1 మొత్తం 11 ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు తెలిపారు. వాటిని మాకవరపాలెం మండలం పైడిపాల గ్రామానికి చెందిన రుత్తల వరహాలబాబు, కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన చీపురుపల్లి రాముల ద్వారా అమ్మడానికి తీసుకు వెళుతున్నట్లు చెప్పారు. చోరీ కేసులను తక్కువ వ్యవధిలో ఛేదించటంలో చాకచక్యత ప్రదర్శించిన అనకాపల్లి సిసియస్. సీఐ నీలయ్య, ఎస్సై పి.రమేష్, ఇతర సి.సి.యస్ సిబ్బంది, నర్సీపట్నం టౌన్ ఇన్స్పెక్టర్ ఎన్.గణేష్, ఇతర సిబ్బందిని ఎస్పి అభినందించారు. కేసులను ఛేదించిన సిబ్బందికి ఎస్పీ రివార్డ్స్ ప్రకటించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

విద్యుత్ స్తంభాలకు అడుగున కాంక్రీట్ వేయాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

నూతనంగా వేస్తున్న విద్యుత్ స్తంభాలకు అడుగు భాగాన సిమెంట్ కాంక్రీట్ వేయాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. మండలంలోని కొరువాడ గ్రామ సమీపాన నిర్మిస్తున్న జగనన్న కాలనీని ఆదివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కాలనీలో ఏడు గ్రామాలకు చెందిన 116 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా విద్యుత్ స్తంభాలు వేయగా ఆ స్తంభాలు ఈదురు గాలులకు వర్షాలకు నేలకొరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనివలన తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ స్తంభాలు ఎక్కడి పడిపోతాయోనని ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. స్తంభాలు వేసేటప్పుడు అడుగున సిమెంట్ కాంక్రీట్ వేస్తే అవి గాలులకు నేలకొరిగే అవకాశం ఉండదని తెలిపారు. ఈ విధంగా చేయకపోవడం వల ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు మండలంలో కొన్ని గ్రామాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన విషయాన్ని విద్యుత్ అధికారులు గమనించాలని హితవుపలికారు. కొరువాడ జగనన్న కాలనీలో వేసిన విద్యుత్ స్తంభాలన్నీ పడిపోయే పరిస్థితుల్లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పునరావాస కాలనీలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

సురక్ష హెల్త్ ఫౌండేషన్, శ్రీవిష్ణు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ఈజెడ్ దిబ్బపాలెం పునరావాస కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కీర్తిశేషులు అడిగర్ల అప్పలనాయుడు వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో 150 మంది రోగులకు ఉచితంగా పలు వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని వైసిపి నాయకులు అడిగర్ల దేవుడు రాజాన విజయ్ చేతుల మీదుగా ప్రారంభం చేశారు. వైద్య శిబిరంలో రక్త పరీక్షలు షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. 15 మంది ఉచితంగా రక్తదానం చేశారు. వైద్య శిబిరంలో రోగులను శ్రీ విష్ణు హాస్పిటల్ ప్రముఖ వైద్యులు అడిగర్ల సుధీర్ డాక్టర్ సందీప్ డాక్టర్ జోష్ణ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లాలం శ్రీను,అడిగార్ల శ్రీధర్, లాలం బాబు, పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

చెరువులను తలపిస్తున్న రహదారులు

ప్రజాశక్తి-చోడవరం రూరల్

నియోజకవర్గ కేంద్రంలో చోడవరం నుండి అనకాపల్లి రహదారిలో ఫారెస్ట్ ఆఫీస్ సమీపాన ప్రధాన రహదారి, నర్సీపట్నం వైపు విజ్ఞాన్ స్కూల్ ఆర్చి ఎదురుగా రహదారి చిన్నపాటి చెరువులను, స్విమ్మింగ్ పూల్స్ తలపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో పెద్ద గోతులు పడడంతో వర్షానికి ఆ గోతుల్లో నీరు చేరింది. ఈ రెండు ప్రదేశాలు ప్రధాన రహదారులు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నియోజక వర్గ కేంద్రంలోనే ప్రధాన రహదారి పరిస్థితి ఇలా ఉంటే గడప గడపకు అంటూ తిరిగి ప్రజల సమస్యలు ఏమి తీరుస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

చోడవరం-నర్సీపట్నంలో రోడ్డులో చెరువును తలపించేలా ఉన్న ప్రధాన రహదారి

కూరగాయల సాగుపై రైతుల మక్కువ

లింగంపేటలో సాగవుతున్న బీర

ప్రజాశక్తి-గొలుగొండ: వేసవిలో కూరగాయల సాగుపై రైతులు ఆశక్తి చూపుతున్నారు. ప్రతీ ఏటా మండలంలో ఈ వేసవిలో 800 ఎకరాలకుపైగా కూరగాయల సాగు జరుగుతుంది. ధరలు నిలకడగా ఉండడంతో లాభాలు వస్తున్నాయి. మండలంలో వ్యవసాయ మోటార్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో రైతులు అధికంగా కూరగాయలు సాగు వైపే మొగ్గు చూపుతున్నారు.
మండలంలో చోద్యం. లింగంపేట, అమ్మపేట, గొలుగొండ, ఏఎల్లపురం, కొత్తమల్లంపేట ఏటిగైరంపేట, గుండుపాల, కొత్తయల్లవరం తదితర గ్రామాల్లో ఈ కూరగాయల సాగు అధికంగా జరుగుతుంది. వంగ, బెండ, బీర, కాకర, టమాటా సాగుపై రైతులు ఎక్కువగా ఆశక్తి చూపుతున్నారు.

వ్యవసాయ మోటార్లు అధికం

మండలంలో చోద్యం, లింగంపేట, కొత్తమల్లంపేట, ఏటిగైరంపేట తదితర ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్లు అదికంగా ఉన్నాయి. ఈ గ్రామాల్లో నీటి సౌకర్యం ఉండటంతో సాగు చేయడం రైతులకు ఇబ్బందులు లేకుండా ఉంది. ఉచిత విద్యుత్ కావడంతో ఈ సాగుకు వీలుగా ఉంటుంది. నీటి నిల్వలు ఉండటంతో ఖర్చు తక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు.

అనుకూలంగా మార్కెట్లు

రైతులు పండించిన కూరగాయల అమ్మకాలకు అనుకూలంగా మార్కెట్లు ఉన్నాయి. ఏఎల్‌పురం, తుని, నర్సీపట్నం మార్కెట్లకు పండిన పంటను తరలించి రైతులు అమ్మకాలు చేస్తున్నారు. కొంత మంది వ్యాపారులు నేరుగా రైతుల వద్దకు వచ్చి వాటిని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు చేస్తున్నారు.

చోద్యంలో సాగు అవుతున్న వంగ

నిలకడగా ధరలు:

బెండ, వంగ, బీర, టమాటా ధరలు వేసవి కావడంతో వీటి ధరలు స్థిరంగా ఉండి రైతులకు కొంతమేర లాభసాటిగా ఉంటున్నాయి. బెండ, బీర, టమాటా సాగుకు ఎకరంకు 20 వేల వరకు ఖర్చు కాగా 50 వేల వరకు ఆదాయం వస్తుంది. బీర సాగు పందిరి విదానంతో సాగు చేయడంతోపంట దిగుబడులు బాగుంటున్నాయి.

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఉన్న పందులు

పందులకు నిలయంగా కార్యాలయాలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో ప్రభుత్వ కార్యాలయాలు పరిస్థితి అధ్వానంగా తయారయ్యింది. పందులు, కుక్కలతో ఆఫీస్‌కు వచ్చే వారు బయపడే పరిస్థితి ఏర్పడుతుంది. మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం ఈ పరిస్థితిని నిలువుటద్దంగా నిలుస్తోంది. పట్టణంలో పందులు, కుక్కల స్వైర విహారంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురుపై దాడి కూడా చేశాయి.
రెవెన్యూ డివిజన్ కేంద్రమైన ఆర్డీవో కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయానికి ప్రతిరోజు అనేకమంది ప్రజలు వస్తూ ఉంటారు. ఇలాంటి ఈ కార్యాలయాలు పందులకు నిలయాలుగా మారాయి శనివారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కార్యాలయానికి ప్రజలు వచ్చినప్పుడు పందులను చూసి భయాందోళనకు గురయ్యారు.తహసిల్ధార్ కార్యాలయం ఆవరణలో వర్షపు నీరు చేరి ఉండడతో పందులు వచ్చి సేదతీరుతున్నాయి. దీంతో ఈ కార్యాలయానికి పనులపై వచ్చే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ ఆపేందుకు యత్నాలు

నర్సీపట్నంలో మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు ఆపేందుకు వర్తకులు, షాపు యజమానులు ప్రయత్నిస్తున్నారు. రోడ్డు విస్తరణకు వ్యతిరేకం కాదంటూ చెబుతూనే ఆపేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే హైకోర్టు న్యాయవాదిని నర్సీపట్నం రప్పించి చర్చా వేదిక ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ చేపట్టే ప్రయత్నం చేసినప్పటికీ కొనసాగక పోవడంతో ప్రస్తుత అధికార వైసిపి పార్టీ నాయకులు, ఎమ్మెల్యే గణేష్ కృషితో జగన్మోహన్ రెడ్డి నుండి అనుమతులు పొందారు. దీంతో వ్యాపారస్తులలో ఆందోళన మొదలయింది. ఈ నేపథ్యంలో హైకోర్టు అడ్వకేటు సలహాలతో రోడ్డు వెడల్పు ఆపడానికి ప్రయత్నిస్తున్నారు. సలహాలు సూచనల మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లుగా తెలుస్తోంది.
ఇదిలా ఉండగా ఏజెన్సీ ముఖద్వారంగా ఉన్న నర్సీపట్నం విద్య, వైద్య, వ్యాపార వ్యవహారాలకు అనుకూలంగా ఉంది. గత పరిస్థితులకు అనుగుణంగా మెయిన్ రోడ్డు 40 అడుగుల లోపు మాత్రమే ఉంది. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం 100 అడుగుల మేర విస్తరణ చేయటానికి ప్రభుత్వం పూనుకుంది. ప్రస్తుత పరిణామాలపై కమిషనర్ కనకారావును వివరణ కోరగా..ఆయన మాట్లల్లో.. ఎనిమిది సంవత్సరాల క్రితమే వంద అడుగులు రోడ్డు వేయటానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీనికి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం జరిగింది. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధారంగా చేసుకుని ప్లాన్లు ఇస్తున్నామని భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. అబిద్ సెంటర్ నుండి పెద్ద బొడ్డేపల్లి మధుము వరకు రోడ్డు 100 అడుగుల విస్తరణకు సర్వం సిద్ధమైనట్లు తెలిపారు. ఐఎల్‌యుపి. ఇంటికేటివ్ ల్యాండ్ యూస్ ప్లాన్ ప్రకారం ప్రణాళిక బద్ధంగా శాస్త్రీయంగా నిర్వహిస్తున్నామన్నారు. వ్యాపారస్తుల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నాలుగు రెట్ల టిడిఆర్ బాండ్ల ద్వారా వ్యాపారస్తులకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. పబ్లిక్ వినియోగానికి వ్యాపారస్తులు శాశ్వతంగా ఆస్తిని ఇస్తున్నందుకు ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. గతంలో రెండు రెట్ల టిడిఆర్ బాండ్లు ఇచ్చేవారని, ప్రస్తుత ప్రభుత్వం వ్యాపారస్తులు నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో నాలుగు రెట్ల టిడిఆర్ బాండ్స్ ఇస్తుందని తెలిపారు. ఈ బాండ్స్‌తో వ్యాపారస్తులు లబ్ధి పొందవచ్చు అని తెలిపారు. ప్రస్తుతము రోడ్ల వెడల్పు మెయిన్ రోడ్డు సెంటర్ పాయింట్ నుండి ఇరువైపులా 50 అడుగుల కూల్చివేతకు మార్కింగ్ జరుగుతున్నాయని తెలిపారు. ముందస్తుగా ఎవరు అభ్యంతరాలు తెలపకుండా ఉండేందుకు కోర్టు నుంచి కూడా అధికార పార్టీకి చెందిన అడ్వకేట్ అనుమతి పొందినట్లు తెలిసింది .

మాట్లాడుతున్న చైర్మన్

మాడుగులలో సురభి నాటక ప్రదర్శనలు

ప్రజాశక్తి-మాడుగుల: జూన్ 6వ తేదీన జరగనున్న మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి పండగ సందర్భంగా భారీ సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈనెల 30 నుండి జూన్ 1 వరకు ఆహ్వాన సాంఘిక నాటికల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని, 2వ తేదీ నుండి 7వ తేదీ వరకు కోటలో సురభి నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేస్తామని, 6వ తేదీ పండగ రోజు గ్రామంలో పలు ప్రదేశాలలో పెద్ద యెత్తున సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల కళాకారులచే నేల వేషాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథ్ శ్రీనివాసరావు, పైదినాయుడు పాల్గొన్నారు.

చినుకు పడితే విద్యుత్ కోత!

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోనే ఎక్కడ చినుకు రాలినా చీకటిమయమే అవుతుంది., ఆదివారం మండలంలో కురిసిన తేలికపాటి వర్షానికి సైతం విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో మండల వాసులు పలు విధాలుగా అసహనం వ్యక్తం చేశారు. ఉదయం నుండి తీవ్రమైన ఎండతో అవస్థల పడ్డ ప్రజలు మధ్యాహ్నం మూడు గంటలకి వాతావరణం చల్లబడడంతో తేలికపాటి వర్షం కురిసింది. ఇలా చినుకు పడిందో లేదో అలా కరెంటు పోయింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి విద్యుత్ కోత విధించారు. ఉన్నతాధికారులు సకాలంలో స్పందించి కరెంటు వెతలు తీర్చాలని కోరుకుంటున్నారు.

గిరి నాగు హల్ చల్

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలో భారీ గిరి నాగు హల్ చల్ చేసింది. కృష్ణం పాలెం గ్రామంలో సురేష్ చౌదరి అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో 13 అడుగుల గిరి నాగు ప్రత్యక్షం కావడంతో స్థానికులు హడలి పోయారు. మాడుగులకు చెందిన స్నేక్ స్నేచర్ పెచ్చెట్టి వెంకటేష్‌కు సమాచారం ఇవ్వడంతో అయన హుటాహుటిన గ్రామానికి చేరుకొని భారీ గిరి నాగును చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ సర్పం 10 కిలోల బరువు ఉంది. అనంతరం సమీప అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు. ఇటీవల కాలంలో మాడుగుల, చీడికాడ ప్రాంతాలలో గిరి నాగులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. సాధారణంగా గిరినాగులు చిన్న శబ్దానికే కదలి దూరంగా వెళ్లిపోతాయని విష సర్పాలను చంపి తింటుందని వెంకటేష్ తెలిపారు.

గిరినాగును బంధిస్తున్న వెంకటేష్

తరలి వచ్చిన భక్తులు

మోదకొండమ్మ సారె ఊరేగింపు

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలో ఆదివారం మోదకొండమ్మ సారె వూరేగింపు ఘనంగా నిర్వహించారు. జగ్గన్న చావిడి, తుడం వీధి, మోదమాంబ కాలనీకి చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు చీర, రవికలతోపాటు వివిధ రకాల నైవేద్యాలు, ఫలాలతో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి మాలా ధారణ చేసిన భక్తులు ఈ కార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు. అనంతరం శతకం పట్టు వద్దకు చేరి అమ్మవారికి పూజలు చేశారు. భక్తులు అధికంగా తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.

సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-నక్కపల్లి: ఆదర్శ కమ్యూనిస్టు నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కొనియాడారు. .మండలంలోని రాజయ్యపేట లో ఆదివారం సుందరయ్య 38వ వర్ధంతి పురస్కరించుకుని గ్రామ ప్రజల సమక్షంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పలరాజు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్ మాట్లాడారు. ఈ తరం యువకులకు సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరినికల రాము, యాదగిరి నవీన్, మామిడి నానాజీ, మైలపల్లి మహేష్, పీక్కి రమణ గోసలస్వామి, మైలపల్లి జాను, సోమేశ్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యచిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

సంతోష్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం (పార్వతీపురం మన్యం జిల్లా)

ప్రజాశక్తి దినపత్రిక విశాఖ యాడ్స్ విభాగం ఉద్యోగి జి.సంతోష్‌కుమార్ తల్లి గోపాలశెట్టి సుశీల అంత్యక్రియలు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలోని అంటిపేటలో ఆదివారం జరిగాయి. సుశీల అనారోగ్యంతో శనివారం విశాఖలోని కెజిహెచ్‌లో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆమె మృతి విషయం తెలియగానే సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, విశాఖ, విజయనగరం సమన్వయ కమిటీల సభ్యులు జి.కాంతారావు, ఎస్.రాజేష్‌రెడ్డి, సిహెచ్.రాము, ప్రజా సంఘాల నాయకులు రెడ్డి రమణమూర్తి, రెడ్డి ఈశ్వరరావు తదితరులు అంటిపేట చేరుకుని సుశీల పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజాశక్తి తరుపున ఆర్థిక సాయం అందించారు. సుశీల మృతిపట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని కరీముఖి పుట్ పంచాయతీ తాంగుల గ్రామంలో ఉపాధి పనులను గిరిజన సంఘం నాయకులు గల్లేల జీనబంధు పరిశీలించారు. అనంతరం. ఆయన మాట్లాడుతూ, ఉపాధి పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంటు, తాగునీరు వంటి సౌకర్యలు కల్పించాలన్నారు. పని దినాలు 200 రోజులు పెంచాలని, ఉపాధి వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారుల జాప్యంతో వేతనాలు సకాలంలో చెల్లించలేకపోతున్నారని విమర్శించారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

-పిడుగు పడి పాడి గేదెలు మృతి - నేల కొరిగిన కరెంట్ స్తంభాలు

విరిగిన కరెంట్ స్తంభం

వంగిన చెట్ల మధ్య ఉన్న బస్

మృతి చెందిన గేదె

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో వాతావరణం మారి పెద్ద గాలులతో కూడిన వడగళ్ళ వర్షం పలు చోట్ల కురిసింది. గాలులు అధికంగా ఉండడంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల కొరిగాయి. ఎన్ కంటారం పంచాయతీ శివారు సుద్దలపాలెం గ్రామంలో టేకు చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడి పోయాయి. గ్రామంలో ఉన్న విద్యుత్ స్తంభం ఒకటి విరిగి పడింది. సిహెచ్ ఎర్రవరం గ్రామంలో విద్యుత్ వైర్లు తెగి రెండు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అదే గ్రామంలో లంక ప్రసాద్ కు చెందిన ఇంటిపై పక్కనే ఉన్న చెట్టు విరిగి పడడంతో ఇల్లంతా పాక్షికంగా దెబ్బతింది. నర్సీపట్నం, కేడీపేట ప్రధాన రహదారిలో ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఉండే వెదురు పుంతలో రోడ్డుపైకి అడ్డంగా వాలి పోయాయి దీంతో సుమారు అరగంట సేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులకు మామిడి కాయలు రాలి పోవడంతో మామిడి సాగు రైతులు లబోదిబోమంటున్నారు. భారీ వర్షానికి పలు గ్రామాల్లో డ్రైనేజీలు లేక పోవడంతో వర్షపు నీరంతా రోడ్లపైనే నిలిచి పోయింది.

పిడుగుపాటుకు రెండు పాడి గేదెలు మృతి చెందాయి. గొలుగొండ ఎస్సీ కాలనీకి చెందిన సరమండ ముసిలిమ్మకు చెందిన గేదె మధ్యాహ్నం చెట్టు కింద కట్టి ఉంచారు. పాడి గేదేపై పిడుగు పడడంతో మృతి చెందింది. పాడి నమ్ముకుని ఆ పేద కుటుంబం జీవనం సాగిస్తున్నారు. పిడుగు పడటంతో జీవన ఆధారం కోల్పోయినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. గేదె విలువ 80 వేల రూపాయల ఉంటుందని బాధితులు తెలిపారు. పశు వైద్య అధికారులు స్పందించి తమకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

చిన్నయ్యపాలెం గ్రామంలో మాతిరెడ్డి రమణమ్మ కు చెందిన పాడి గేదె పిడుగుపాటుకు మృతి చెందింది. చనిపోయిన గేదె విలువ సుమారు 70వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. అధికారులు తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి అరటి సాగు రైతులంతా తీవ్రంగా నష్టపోయారు. మండలంలో ఏటి గైరంపేట, గాదంపాలెం, లింగంపేట గ్రామాలలో సుమారు 40 ఎకరాలలో అరటి తోటలు పూర్తిస్థాయిలో నేలమట్టమయ్యాయి.

భారీ వర్షం

బుచేయ్యు పేట : ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజానీకానికి మరోసారి ఊరట లభించింది. ఆదివారం మధ్యాహ్నం బుచ్చయ్యపేట మండలం లోని దిబ్బడి, బచ్చయ్య పేట, రాజాం, సీతయ్యపేట, గున్నంపూడి, కొండపాలెం, పరిసర ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు భానుడు ప్రతాపం చూపించగా తరవాత ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులుతో వడగళ్ల వర్షం కురిసింది. పిడుగుల శబ్దాలకు ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి.

తడిచిన రోడ్డు

చోడవరం:మండలంలో కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చోడవరం మల్చర్ల పాలెం రోడ్‌లో తాడిచెట్లు విరుకుబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లక్ష్మీపురంలో విద్యుత్ స్తంభాలు నేలకొరవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

ఘనంగా ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు

అనకాపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టిఆర్ పాలనలోనే అభివృద్ధికి అంకురార్పణ జరిగిందని, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఎన్‌టిఆర్ శతజయంతిని పురస్కరించుకుని 90వ వార్డు విమాననగర్‌లో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి విశాఖ పార్లమెంటరీ పార్టీ సెక్రటరీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో నాలుగువేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టిపాటి సురేష్‌కుమార్, నాయకులు బి శ్రీకాంత్, యు బ్రహ్మేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, వేణుబాబు పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖ రత్న, దాసరి కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ శతవసంత వేడుకలు ఆదివారం ముగిసాయి. ఉపకార చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుతరావు, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, నాంచారయ్య బొమ్మిడి సత్యనారాయణ, దుగ్గివలస దివాకర్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిసి సంఘ నాయకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, సింహాచలం ట్రస్ట్ బోర్డు మెంబర్ శీను బాబు, కోరుకొండ రంగారావు, వ్యవస్థాపకుడు పిఎ. భాస్కరరావు, కోఆర్డినేటర్ మల్లిక పాల్గొని వివిధ రంగాల్లో నిష్ణాతులను ఎన్‌టిఆర్ పురస్కారాలతో సత్కరించారు.

భీమునిపట్నం : స్థానిక చిన్న బజారు జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి టిడిపి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జివిఎంసి వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, పార్టీ వార్డు ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్, వార్డు తెలుగు యువత అధ్యక్షులు కనకల అప్పలనాయుడు, కాసరపు నాగరాజు, కొక్కిరి అప్పన్న, పి లక్ష్మీకుమారి పాల్గొన్నారు

సీతమ్మధార : 26వ వార్డులో కార్పొరేటర్ ముక్కా శ్రావణి ఆధ్వర్యంలో సంఘం కార్యాలయం వద్దఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వార్డు సెక్రటరీ పెద్డ లక్ష్మణ, కన్వీనర్లు రహీం, భాను, ఫాతిమా, వెంకటలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని లోడగలవానిపాలెం గ్రామంలో మాజీ జెడ్‌పిటిసి బమ్మిడి ఉమాదేవి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ, టిడిపి సీనియర్ నేతలు చిరకాన సూరి నాయుడు, కర్రోతు సత్యనారాయణ, ఇల్లిపిల్లి సన్యాసిరావు, నాగోతి రమణ, బంక సూరిబాబు పాల్గొన్నారు

పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభం జంక్షన్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి తెలుగు యువత. మండల అధ్యక్షులు కెవి. సత్యనారాయణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.లీలావతి, మూర్తి, నందీశ్వరరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : 10వ వార్డు రవీంద్రనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. 9వ వార్డు జోడుగుళ్ళపాలెంలో వార్డు టిడిపి ఇన్‌చార్జ్ బుడుమూరు గోవిందు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మారుపల్లి చిన్నారావు, గరికిన నూకరాజు, మైలపల్లి శ్రీను, నాగేశ్వర్రావు, భూలక్ష్మి పాల్గొన్నారు.

12వ వార్డు టిడిపి ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, బాలాజీనగర్, తోటగరువు ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టిడిపి నాయకులు ఏడువాక సన్యాసిరావు, కృష్ణంరాజు, కొత్తల గోపాల్, బసవ దేవుళ్ళు, బండారు శంకరరావు, పేరినాయుడు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : సనరా- చందు ఆర్ట్స్ మూవీస్ ఆధ్వర్యాన విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు మణిశర్మ, ఆడారి కొండలరావు, ఐడిజెఎస్ పత్రం ఆరు జిల్లాల ఇన్‌ఛార్జి విశాఖ చాప్టర్ సిటీ అధ్యక్షులు గొట్టివాడ దనేష్, నాటక గ్రంథాలయం వ్యవస్థాపక అధ్యక్షులు బాదంగీర్ సాయి, నాటక రంగ ప్రముఖులు, కరాటే క్రీడాకారిణిలను ఎన్‌టిఆర్ పురస్కారాలను నిర్వాహకులు అందజేసి సత్కరించారు. విశాఖ సమాచారం దినపత్రిక సంపాదకులు సూరంపూడి వీరభద్రరావు, ప్రజాప్రస్థానం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తోట ముకుంద్, విజెఎఫ్ ఉపాధ్యక్షులు నాగరాజు పట్నాయక్, సనరా -చందు ఆర్ట్స్ మూవీస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆర్‌కె.బీచ్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ నివాళులర్పించారు. బోడెపూడి దొరబాబు, శివ నాగేశ్వరరావు, వసంతరావు పాల్గొన్నారు.

రాగమయ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు కంధర్ప రాధ, గంటి అభినయల సారధ్యంలో ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఎమ్‌వి.రాజశేఖర్, మహమ్మద్ ఖాన్, జెఎన్‌ఆర్ నెహ్రూ, భపుండరీ కుమార్ పాల్గొన్నారు.

మాడుగుల:మండల కేంద్రంలో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. నేతలు పుప్పాల అప్పలరాజు, లెక్కల కాశిబాబు, రంజిత్ వర్మ, సూరిబాబు, వేగి రాంబాబు, ఢిల్లీ నానాజీ, పంతులు మూర్తి, సూరి, ఎస్‌వి పాల్గొన్నారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో ఆ పార్టీ అధ్యక్షులు జానకి శ్రీను ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి లింగన్న నాయుడు, తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, సుంకర బాబ్జి, పెట్ల నరేష్, కొల్లాటి అప్పారావు, తంగేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి:ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు అనకాపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పరమేశ్వరి పార్క్ జంక్షన్‌లో బాలకృష్ణ ఫాన్స్ పొలిమేర నాయుడు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ మురళి, కర్రి గోపి, దాడి జగన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ వద్ద జరిగిన కార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు మాట్లాడారు.

మునగపాక రూరల్ : టిడిపి నాయకులు స్థానిక మెయిన్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, ఆడారి జానకి, మాలతి, అప్పలరాజు, మల్ల శేషుబాబు, కోరుకొండ ప్రసాద్, పాల్గొన్నారు.

మాడుగులలో నివాళి అర్పిస్తున్న నాయకులు

పరవాడ : పరవాడ సంత బయలు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ జడ్పిటిసి పైలా జగన్నాధరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రావాడ ఎన్టీఆర్ కాలనీ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి గ్రామ టిడిపి నాయకులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అట్టా సన్యాసి అప్పారావు, పయిల బుజ్జి, పయిల కృష్ణ, వర్రి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ బసవతారకం విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, పెంటకోట రాము, వేగి గోపి కృష్ణ, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం : టీడీపీ మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గండి దేముడు, కోటాన అప్పారావు, రొంగలి దేముడు, బోకం సత్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని మోసయ్యపేట గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డి.నాయుడు బాబు, ఎల్లపు వెంకటరావు, దేవర కృష్ణ, పుర్రె రాజు, చొప్ప గోవిందరాజు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దిబ్బడి, బుచ్చయ్యపేట, రాజాం జరిగిన కార్యక్రమంలో జి.ముత్యాలు, చిన్ని పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.